జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
గురువారం 19 నవంబర్ 2026 పేజీలు:14



కోదాడ సంక్షేమ అధికారిణి వంగపల్లి పద్మకు అరుదైన గౌరవం

యువత మేలుకో,వెతుక్కో నీ భవిత కవిత్వానికి సన్మానం

వంగపల్లి పద్మను అభినందించిన సాహితీ ప్రముఖులు

2 లో



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ 2,200 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే



మిర్యాలగూడ, నవంబర్ 18, ప్రజాజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతి లో నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమంలో మిర్యాలగూడ, దామరచర్ల, అడవి దేవులపల్లి మండలాలకు చెందిన మొత్తం 2,200 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

వివరాలు 2లో

భువనగిరి నియోజక వర్గంలో 1,894 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు

- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



భువనగిరి,నవంబర్ 18(ప్రజాజ్యోతి) భువనగిరి పట్టణంలోని ఏకే ప్యాలెస్‌లో, నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిపాల్గొని, భువనగిరి మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా చేయూత పింఛన్లు,మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.భువనగిరి మండలంలో 1,044 మందికి,భువనగిరి మున్సిపాలిటీలో 850 మందికి కలిపి మొత్తం 1,894 మందికి నూతన పింఛన్లు మంజూర య్యాయి.

వివరాలు 2లో



పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలి

- ఫారం-18 దరఖాస్తులను బల్క్‌గా స్వీకరించొద్దు
- ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 18(ప్రజా జ్యోతి): పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాల ఓటరు జాబితా నూతన రూపకల్పన ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ అధికారులను ఆదేశించారు.ఫారం-18 దరఖాస్తులను బల్క్‌గా స్వీకరించకుండా,ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు.బుధవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాల నూతన రూపకల్పన (డి-నోవో) ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.సూర్యాపేట జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.

వివరాలు 2లో

భువనగిరి నియోజక వర్గంలో 1,894 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు

మొదటిపేజీ తరువాయి





ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాం క్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజల సంక్షేమాన్ని విస్మరిం చిందని,అర్హులైన అనేకమంది పింఛన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి కల్పించిందని విమర్శిం చారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించిన గత ప్రభుత్వా నికి,ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలకు చేయూత పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతగాభావిస్తోందన్నారు.గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పింఛన్ల కోసం ఎదురుచూసిన అర్హులకు నేడు మంజూరు ప్రొసీడింగ్స్ అందడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.భువనగిరి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.అనంతరం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి పాలాభిషేకం చేసారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి -రవికుమార్,జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవేస్ చిస్తి,మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు,తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి భువనగిరి, చందుపట్ల పి ఏ సి ఎస్ చైర్మన్లు పక్కిర్ కొండల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వారికి చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవనానికి అండగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంపిడిఓ లు, కార్యదర్శిలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ సంక్షేమ అధికారిణి వంగపల్లి పద్మకు అరుదైన గౌరవం

మొదటిపేజీ తరువాయి

కోదాడ టౌన్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):

సాహితీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన కోదాడ ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహ సంక్షేమ అధికారిణి వంగపల్లి పద్మకు జాతీయ స్థాయిలో అరుదైన సత్కారం లభించింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని గురజాడ పాఠశాల ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక, తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ?"యువత మేలుకో,వెతుక్కో నీ భవిత అనే శీర్షికతో ఆమె రాసిన కవిత్వానికి ప్రశంసలు దక్కాయి. ఈ సందర్భంగా కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ ఈశ్వరి భూషణం, డాక్టర్ టి. పార్థసారథి, డాక్టర్ రవ్వార్ గోవిందరావు, ఎన్. గురుప్రసాద్, గొర్లె సీతారాములు కలిసి పద్మను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.



పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఓటరు నమోదు,దరఖాస్తుల పరిశీలన,అర్హులైన పట్టభద్రులను ఓటరు జాబితాలో చేర్చే ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఫారం-18 దరఖాస్తులను సామూహికంగా స్వీకరించరాదని,ప్రతి దరఖాస్తుదారుడి అర్హతను వ్యక్తిగతంగా పరిశీలించాలని సూచించారు.దరఖాస్తులకు జతచేసిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు.అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లు నమోదుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్,డీఆర్వో ప్రేమ్ రాజ్,కోదాడ,హుజూర్‌నగర్ ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు,ఎన్నికల విభాగం అధికారులు రాజేంద్రరెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి..

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ సూచన..

- ప్రజాస్వామ్యం, ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి..

- జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్

నల్లగొండ, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):







విద్యార్థులు చదువుతోపాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు.బుధవారం నల్లగొండ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణలో ఓటరు నమోదు నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు జరిగే వివిధ దశలను వివరించారు. ఈవీఎంల పనితీరు, భద్రతా విధానాలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత ఎన్నికల విధానాన్ని పరిశీలించేందుకు ఇటీవల 18 దేశాల ప్రతినిధులు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. విద్యార్థులు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకొని బాధ్యతగల పౌరులుగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్ రావు, డైట్ ప్రిన్సిపల్ కె. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరి కిబదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

మిర్యాలగూడ,నవంబర్ 18, (ప్రజాజ్యోతి):

యాసంగి సీజన్‌లో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగుకు బదులుగా ఆరుతడి, ఆకు కూరగాయల పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కంపాసాగర్ ఉద్యానవన శాస్త్రవేత్త, ఫీల్డ్ ఆఫీసర్ టి.హిమబిందు, ఉద్యానవన శాఖ మిర్యాలగూడ డివిజన్ అధికారి షేక్ నసీమా, మిర్యాలగూడ మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం. బుషేంద్రమణిలు సూచించారు. బుధవారం మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి వనరుల పరిమితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పెసర, మినుము, ఆకుకూరలుదోస, బీర, కాకర, సొరకాయ కూరగాయలు వంటి తీగజాతి తక్కువ నీటి అవసరం కలిగిన పంటలను డ్రిప్ ద్వారా సాగు చేయాలన్నారు. ఆరుతడి పంటల సాగు ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు దోహద పడవచ్చన్నారు.రైతులు పంటల మార్పిడిని పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనాయక్, రైతులు పాల్గొన్నారు.



పోలీస్ అక్క- విద్యార్థినిలకు భరోసా



కోదాడ టౌన్,నవంబర్ 18 (ప్రజా జ్యోతి):



గౌరవనీయులైన ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి సూచనలతో, కోదాడ సబ్ డివిజన్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కోదాడ సబ్ డివిజన్ షి టీమ్ ఎస్ ఐ మల్లేష్ విద్యార్థినుల్లో భద్రతా భావన పెంపొందించడం, మహిళల రక్షణపై "పోలీస్ అక్క" కార్యక్రమం ను తమ్మరబండ పాలెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ప్రతి విద్యాసంస్థలో విద్యార్థినులకు భరోసాగా నిలవడమే 'పోలీస్ అక్క' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా లి'పోలీస్ అక్క'లిను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని విద్యార్థినులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--112, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్--1930 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.ఇట్టి కార్యక్రమం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు , షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు సాయి జ్యోతి, నాగేంద్ర బాబు, సౌజన్య, విద్యార్థిని విద్యార్థిలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యం

– ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

సూర్యాపేట కలెక్టరేట్ నవంబర్ 18(ప్రజా జ్యోతి):

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ప్రారంభం కానుందని తెలిపారు.బుధవారం పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల స్వీకరణ, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐడీఓసీ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోనూ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు

పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా రాబోయే రెండు వారాల పాటు గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక



దరఖాస్తుల స్వీకరణ శిబిరాలు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు ఫారం సేకరించడంతో పాటు బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు స్థాయి అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకొని ఎవరూ నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా పర్యవేక్షించాలని సూచించారు.

విస్తృతంగా ప్రచారం కల్పించాలి

పథకం లక్ష్యం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సీఎస్ తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాను సమర్థవంతంగా



వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా పథకం వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు.ప్రారంభోత్సవాలను ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రచార కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక భద్రతా పథకాలపై అవగాహన పెంచుకోవాలి

కోదాడ టౌన్ ,నవంబర్ 18 (ప్రజా జ్యోతి):

కోదాడ: ఎఫ్ఐ శాచురేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్‌డీఎం మల్లెల వెంకట నాగప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ రంజిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పి ఎం జె జె బి వై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పి ఎం జె జె బి వై), అటల్ పెన్షన్ యోజన (ఏ పి వై) పథకాల ప్రయోజనాలను వివరించి, అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, అటెండర్ వినోద్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సతీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..... సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్

- పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ

- కోదాడ ఆర్డీవో కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు

కోదాడ టౌన్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):

?జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం కోదాడ పట్టణంలోని ఆర్డీవో





కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు న్యాయ సేవలు, వివిధ చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.?ఈ సందర్భంగా జడ్జి కె. సురేష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ క్రిమినల్, సివిల్ మరియు రెవెన్యూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు సైతం తమ హక్కుల కోసం కోర్టును ఆశ్రయించవచ్చని, వారికి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పూర్తిగా ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ చట్టాలు, కుటుంబ చట్టాలు, భూ సమస్యల పరిష్కార మార్గాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, తహసిల్దార్ సంతోష్ కుమార్, న్యాయవాదులు తమ్మినేని హనుమంతరావు, ఉయ్యాల నరసయ్య, కోడూరు వెంకటేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, సామా నవీన్ కుమార్, దుగ్గి వెంకటేష్ రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సుంకం నిధులను పక్కదారి పట్టిస్తే సహించం

రామన్నపేట నవంబర్ 18 (ప్రజా జ్యోతి)



భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల నుంచి వసూలు చేస్తున్న సుంకం నిధులను ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించాలని చూస్తోందని, ఆ నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు ప్రభుత్వాన్ని కోరారు.రామన్నపేటలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాల్సిన సుంకం నిధులను ఇతర సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తూ భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోందని విమర్శించారు.ఇందులో భాగంగానే బీమా కార్యకలాపాలను ట్రయల్ బ్లేజర్ సంస్థ అనే వ్యక్తిగత సంస్థకు అప్పగించారని, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి భవన నిర్మాణ కార్మికుల సుంకం నిధులను మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కార్మికుల కష్టార్జితంతో సమకూరిన నిధులను వారి సంక్షేమం, భద్రత, భవిష్యత్తు అవసరాల కోసం మాత్రమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని బలోపేతం చేయాలని, కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా, విద్య, వైద్యం వంటి ప్రయోజనాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. సుంకం నిధులను ఇతర పథకాలకు మళ్లించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని, లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, అప్పం సురేందర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వంగాల మారయ్య, బుద్ద ప్రసాద్, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడుతాం

– ఆలేరు మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్

ఆలేరు నవంబర్ 18(ప్రజా జ్యోతి)

ప్రజల సమస్యల పరిష్కారానికి మరిన్ని ర్యాంపులు సిసి రోడ్లు నిర్మిస్తూ పట్టణానికి శ్రీకారం చుడతామని ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి భాస్కర్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ కేంద్రంలో వాహనదారులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపట్టిందన్నారు. పట్టణంలోని బస్టాండు సమీపంలో ప్రతాపరెడ్డి దావకాన పక్కన కాలనీకి వెళ్లే రహదారిపై చాలా కాలంగా ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య సహకారంతో సిసి రోడ్లు ర్యాంపు నిర్మాణ పనులను వారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎజాస్, రాములు, మార్కు శ్రీనివాస్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోటకొండూరు 416 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు నవంబర్ 18(ప్రజా జ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 416 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తోంది. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో నూతన పెన్షన్ల మంజూరు చేస్తున్నాం అన్నారు..మోటకొండూరు మండలంలో 416 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ పెన్షన్లు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని అన్నారు.ఆరు గ్యారంటీల అమలుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాం. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, రైతు రుణమాఫీ ద్వారా రుణభారం నుంచి విముక్తి కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.అలాగే పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం, నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మా ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధిగా, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిరంతరం కృషి చేస్తాను. ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ



వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లమల సంజీవరెడ్డి, సర్పంచు జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నికిత మహేందర్, బుగ్గ కొమురయ్య, పలు గ్రామాల సర్పంచులు ఆకుల శ్రీనివాస్, జన్నే సిద్ధులు, మంత్రి లతా స్వామి, దివ్య మకర జ్యోతి కార్తీక్, గోలను ఆంజనేయులు, చిరంజీవి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి లో డెడ్ బాడీ,దహనాల కలకలం

- ఆసుపత్రి మార్చురి పక్కనే మనిషి పుర్రెలు గుర్తింపు

- పోలీస్ విచారణ చేపట్టి- ఆసుపత్రి సూపరిండెంట్,

- ఆర్ ఎం ఓ ను సస్పెండ్ చేయాలని - రాజకీయ నాయకుల డిమాండ్

- మృతదేహాలకూ దిక్కేది..?- భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో అమానవీయ ఘటన!

- బతికున్న వారికి వైద్యం.. చనిపోయిన వారికి దహనమేనా?

- అధికారుల పర్యవేక్షణ ఏదీ..?- కలెక్టర్ విచారణకు ఆదేశించాలని ప్రజా సంఘాల డిమాండ్

భువనగిరి నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

మానవత్వం మంటగలిసిందా? ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస బాధ్యతలు సైతం గాలికొదిలేశారా?యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మార్చురీ పక్కనే మృతదేహాలను దహనం చేసినట్లు వస్తున్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మరణించిన వారి మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించి, ఆసుపత్రి ప్రాంగణంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చనిపోయిన వారికైనా గౌరవం ఇవ్వరా?

గుర్తుతెలియని, అనాథ మృతదేహాలకు సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాంటిది మార్చురీ పక్కనే మృతదేహాలను దహనం చేసినట్లు ఆరోపణలు రావడం ఆసుపత్రి నిర్వహణ తీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఇలాంటి ఘటన జరిగిందన్న ఆరోపణలు వస్తుంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అసలు అవి ఎవరి మృతదేహాలు?



దహనం చేసినట్లు చెబుతున్న మృతదేహాలు ఎవరివి? వాటికి సంబంధించిన రికార్డులు ఉన్నాయా? మృతుల గుర్తింపును నిర్ధారించారా? అవి అనాథ మృతదేహాలైతే అంత్యక్రియల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు పాటించారా? ఆసుపత్రి ప్రాంగణంలోనే దహనం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

బాధ్యులెవరు.. సమాధానం చెప్పేదెవరు?

ఈ ఘటనలో ఎవరి పాత్ర ఎంత? ఎవరి అనుమతితో మృతదేహాలను దహనం చేశారు? ఆసుపత్రి సిబ్బందికి, ఉన్నతాధికారులకు ఈ విషయం తెలుసా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

యాదాద్రి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.



జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆసుపత్రిలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నాయి. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పేదలకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మానవీయ విలువలకే భంగం కలిగితే ప్రజలకు న్యాయం ఎక్కడని ప్రశ్నించాయి. ఈ ఘటనపై అధికారులు మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్--వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూల సిద్ధులుకు సన్మానం

ఆలేరు నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ ఆరవ వార్డు బహుదూర్ పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కూల సిద్ధులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎన్నిక కావడంతో బుధవారం తన స్నేహితులు అయినటువంటి సిరిగిరి విద్యాసాగర్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోటే అరవిందు ,చీర సురేష్, బుడిగ భాను, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలి

హాలియా, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)



రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు,నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సూచించారు.అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటలు,కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు.బుధవారం అనుముల మండలం శ్రీనాధపురం గ్రామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో పంటల వైవిధ్యీకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.అనంతరం రానున్న రబీ సీజన్‌లో సాగు చేయనున్న మెట్ట పంటలకు సంబంధించి రైతుల నుంచి విత్తనాల అవసరాల వివరాలను అధికారులు సేకరించారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న నీటి వనరులు,భూమి పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు సాగులో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో హాలియా ఏడీఏ ఎం.సరిత, అనుముల మండల వ్యవసాయ అధికారి ఎం.వెంకన్న, ఉద్యానవన శాఖ అధికారి మురళి,ఉద్యానవన విస్తరణ అధికారి జాన్‌రెడ్డి,గ్రామ సర్పంచ్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు...

- మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా,నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేసి,ఆర్థికంగా అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి స్పష్టం చేశారు. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను బుధవారం హాలియా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందని తెలిపారు. సమాజంలోని బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ,వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో అనుముల మండల ప్రత్యేక అధికారి సుసింధర్ రావు, హాలియా మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి



మధు,మున్సిపల్ కమిషనర్ కె.రవీందర్ రెడ్డి,వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్,ఎంపీడీవో ఎం.డి.మజీద్,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ కుందూరు వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి,పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్,కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు,నకిరేకంటి అన్నపూర్ణ సైదులు,మహమ్మద్ గౌహర్ జబీన్ మజహర్,కౌన్సిలర్ సలహాదారులు చిట్టిప్రోలు కరుణాసాగర్,పిల్లి ఆంజనేయులు,ఎడవల్లి రంజిత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్,కోఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి,మహమ్మద్ రషీద్, సర్పంచులు, అధికారులు,నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీసీతో తో విద్యార్థులకు మంచి భవిష్యత్తు



ఆలేరు నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

ఎన్సీసీతో విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని, తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్ సి స్ అధికారి దూడల వెంకటేష్, ఆర్మీ అధికారి హావల్దార్ ఉమేష్ కాంబ్లే అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలేరులో బుధవారం నాడు 2 సంవత్సరాల ఎన్సిసి కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి ూ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థు లకు ఈ రెండు సంవత్సరాల కాలంలో డ్రిల్, ఆయుధాల వినియోగం, మ్యాప్ రీడింగ్ అంశాల తోపాటు శారీరక, మానసిక వికాసం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు పెంపొందించమన్నారు. వెపన్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, ఫైరింగ్ తదితర విభాగాలలో శిక్షణ పొంది ఉత్తీర్ణత అయిన వారికి ఈ సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని



వారు తెలిపారు. ఈ ఎన్సిసి సర్టిఫికెట్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తు జీవితంలో విద్యా ఉద్యోగ అవకాశాలలో ఎంతో తోడ్పడతాయని, అన్నింటికీ మించి క్రమశిక్షణాయుత జీవితం అలవడుతుందని అన్నారు. ఈ ఎన్సిసి ద్వారా యువత దేశభక్తి గల పౌరులుగా తయారవుతున్నాయని తెలిపారు. ఈ సర్టిఫికెట్లు అందుకున్న వారిలో క్యాడెట్లు భార్గవి, భవాని, రేచల్, వర్షిత, సంజయ్, రిత్విక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సదస్సు

నడిగూడెం, నవంబర్ 18, ప్రజా జ్యోతి:

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి నడిగూడెం రైతు వేదికలో మంగళవారం నడిగూడెం, మునగాల, మోతే మండలాల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి శ్రీ దామోదర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సదస్సులో డిప్యూటీ సీఈవో శ్రీమతి మహాలక్ష్మి, మోతే మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా మూడు మండలాల ఎంపీడీవోలు ఎల్. మల్సూర్ నాయక్, సందీప్, నరేష్, తహసీల్దార్లు ఎల్. మంగ, సరిత, వెంకన్నతో పాటు అన్ని మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పరిపాలనా అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మాస్టర్ ట్రైనర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పథకం అమలులో అధికారుల బాధ్యతలు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అంశాలపై సదస్సు నిర్వహించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.



చేయూత పెన్షన్లతో పేదలకు ఆర్థిక భరోసా

పెన్షన్లు పంపిణీ చేసిన ఏఎంసీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్

నడిగూడెం, నవంబర్ 18, ప్రజాజ్యోతి:

తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా కల్పిస్తోందని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొక్క భిక్షపతితో కలిసి లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, దివ్యాంగులకు చేయూత పెన్షన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో కోదాడ నియోజకవర్గంతో పాటు నడిగూడెం మండల అభివృద్ధికి కృషి జరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల కన్వీనర్ బూత్కూరి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎలకా ఉమారాణి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, టీడీపీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వివోలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పలకు...వెంకటేషుని చేయూత...!

- దీక్ష స్వాముల శబరి యాత్రకు 'ప్రత్యేక రైలు' ఏర్పాటు చేస్తున్న మిట్టపల్లి వెంకటేష్

- 1200 మందికి ఉచిత ప్రయాణానికి అవకాశం

- డిసెంబర్ 22న, మిర్యాలగూడ నుండి చెంగనూరు కు బయలుదేరనున్న రైలు







మిర్యాలగూడ, నవంబర్ 18,(ప్రజాజ్యోతి):

ఎల్ నినో ప్రభావంతో..కరువు కోరలు చాస్తున్నా... అయ్యప్ప స్వామి పై ఉన్న అపార భక్తితో 41 రోజులపాటు దీక్ష చేస్తున్న నియోజక వర్గంలోని అయ్యప్ప స్వాములకు మానవసేవే పరమావధిగా భావించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్ అయ్యప్ప స్వాముల శబరి యాత్ర కోసం ఏకంగా ఓ రైలునే ఏర్పాటు చేసి ఉచిత ప్రయాణానికి తన వంతు చేయూతను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. బుధవారం పట్టణంలోని వైదేహి టౌన్ షిప్ లో తన నివాసం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురుస్వాములతో కలిసి శుభవార్తను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్ష కాలం పూర్తిచేసుకుని శబరిమలై వెళ్లేందుకు సిద్ధమయ్యే మాలాధారణ స్వాముల కోసం ఉచితంగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 22వ, తారీఖున మిర్యాలగూడ నుంచి ప్రత్యేక రైలు బయలుదేరి చెంగనూరు చేరుకుంటుందని, తిరిగి 25వ తారీఖున చెంగనూరు నుండి బయలుదేరి మిర్యాలగూడ కు రైలు చేరుకుంటుందన్నారు. రైలు బయలుదేరే నాటికి మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు ఈ ఉచిత సేవను వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1200 మంది దీక్ష స్వాములకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రయాణాన్ని వినియోగించుకునే స్వాములు నవంబర్ 18 నుండి 28 వ తారీకు వరకు తమ ఆధార్ కార్డులు, ఫోన్ నెంబర్లు, పూర్తి వివరాలు మిట్టపల్లి వెంకటేష్ టీం సభ్యులు 8142782580,9014592580 నెంబర్లకు లేదా నేరుగా వైదేహి టౌన్షిప్ లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన కౌంటర్ లో సంప్రదించాలని కోరారు. రాజకీయ పార్టీలు, కులాలకతీతంగా అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్వాములంతా ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పవిత్ర కార్తీక మాసంలో మాల ధారణ చేసిన స్వాములకు తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక రైలు ఏర్పాటుకు అయ్యే ఖర్చులు తన సొంత నిధులతో వెచ్చిస్తున్నానని, ప్రయాణం ప్రారంభమయ్యే నాటికి స్వాములకు అల్పాహారం, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించి చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పుణ్యకార్యాన్ని నియోజకవర్గంలోని స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట గురుస్వామి మాశెట్టి(డైమండ్) శ్రీనివాస్, తదితర గురుస్వాములు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు హాలియా విద్యార్థిని సాత్విక ఎంపిక.!

హాలియా,నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

జాతీయ స్థాయి పోటీలకు హాలియా విద్యార్థిని సాత్విక ఎంపికైనది.గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ప్రేరణ అనుభవాత్మక అభ్యసన జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో హాలియా పబ్లిక్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎన్.సాత్విక ఎంపికైనది. తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకోవడంతో పాఠశాలతో పాటు హాలియా పట్టణానికి గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా గుజరాత్‌కు బయలుదేరనున్న సాత్వికను పాఠశాల యాజమాన్యం ఘనంగా అభినందించారు.పాఠశాల చైర్మన్ మేడేపల్లిమోహన్ రావు, డైరెక్టర్ తడకమళ్ల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఎన్.గోపి నాయర్ అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సాత్విక ప్రతిభకు,కృషికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటుకుని విజయం సాధించి పాఠశాలకు,తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,సాత్వికకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా బోట్ల కవిత

ఆలేరు నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బొట్ల కవిత నూతన ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నామీద నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు రుణపడి ఉంటాను అన్నారు. నిత్యం రైతుల వెంబడి ఉండి వారికి సమస్యలు రాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.



నూతన ఎస్.ఐ వెంకటేశ్వర్లుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానం

నార్కట్ పల్లి.నవంబర్ 18(ప్రజా జ్యోతి):

నార్కట్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. వెంకటేశ్వర్లు ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ చిరు సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీ ఎస్ నార్కట్ పల్లి మండల అధ్యక్షులు లింగాల ముత్తయ్య మాట్లాడుతూ, నూతన ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు మంద సుధాకర్, పందుల రాకేష్, బొజ్జ సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.



దేశముఖిలో గురువారం కరెంట్ కట్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

మండలంలోని దేశముఖి గ్రామంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ మండల అసిస్టెంట్ ఇంజనీర్ బి. ఉమ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులతో పాటు విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కావున సంబంధిత గ్రామ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

వలిగొండ మండలంలో 1,105 మందికి నూతనంగా చేయూత పింఛన్లు

- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ నవంబర్ 18(ప్రజా జ్యోతి న్యూస్)

పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాలులో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.64 లక్షల మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేయగా, వలిగొండ మండలంలో 1,105 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హతలే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపుపై ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే ఎంపీడీవోను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, తహసీల్దార్ దశరథ్, పిఎసిఎస్ చైర్మన్ గరిసె రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు,గూడూరు శివశాంత్ రెడ్డి, తుమ్మల యుగంధర్ రెడ్డి, పాశం సతిరెడ్డి, నూతి రమేష్, పలుసం సతీష్ గౌడ్, జక్క జంగారెడ్డి, కాసుల వెంకన్న, కొండూరు సాయి, వివిధ గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

నాగార్జునసాగర్ డ్యామ్ డెడ్ స్టోరేజీ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే ఎన్. భాస్కర్ రావు

మిర్యాలగూడ, నవంబర్ 18,(ప్రజాజ్యోతి):

మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే,బి ఆర్ ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమోతు భాస్కర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ హామీల ప్రతులను చించి చెత్తబుట్టలో వేసి నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా నాగార్జునసాగర్ డ్యామ్‌లో ఉన్న డెడ్ స్టోరేజీ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించే ప్రయత్నాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను, రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి నీటిని తరలించే ప్రయత్నాలు చేయడం సరికాదని అన్నారు. ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజల హక్కులు, రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం బి ఆర్ ఎస్ పార్టీ నిరంతరం పోరాటం



చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని భాస్కర్ రావు స్పష్టం చేశారు.ఈకార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, ఎండి. యూసుఫ్, దుర్గంపూడి నారాయణ రెడ్డి,ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి,ఎండి.ఇలియాస్ ఖాన్, మట్టపల్లి సైదయ్య యాదవ్,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య,కుందురు వీరకోటిరెడ్డి, పెద్ది శ్రీనివాస గౌడ్, ఎండి. మాజీద్, దైద సత్యం, పెండ్యాల పద్మ, గుడిసె దుర్గా ప్రసాద్, సందేషి అంజన్ రాజు,మర్రి అంజిబాబు,యర్రమళ్ళ దినేష్, పిసి కె ప్రసాద్, పులి జగదీష్, పేరాల కృపాకర్ రావు,పునాటి లక్ష్మీనారాయణ, ప్రకాష్ నాయక్,ఎండి.షోయబ్, వేలిచేటి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలు ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువుల పంపిణీ చేయాలి

వలిగొండ నవంబర్ 18(ప్రజా జ్యోతి న్యూస్)

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని భువనగిరి డివిజన్ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ, సంకల్ప ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, విక్రయాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి ఎరువుల దుకాణంలో రిజిస్టర్లను తప్పనిసరిగా పకడ్బందీగా నిర్వహించాలని యాజమానులకు సూచించారు. రైతులకు ఈ-పాస్ విధానం ద్వారానే ఎరువులను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎరువుల యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులకు నిబంధనల ప్రకారం ఎరువులు అందించాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు అన్నదానం, పండ్ల పంపిణీ

వలిగొండ నవంబర్ 18(ప్రజా జ్యోతి న్యూస్)

:ఆపన్నులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన వలిగొండ పీఏసీఎస్ చైర్మన్ గరిసే రవి కుమారుడు స్వర్గీయ గరిసే ఋషికేష్ ఆరవ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని టేకుల సోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని దివ్యాంగులకు భోజనం అందించడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాద శంకర్ గౌడ్, మైసోల్ల ప్రవీణ్, బొమ్మగాని మహేష్, గుండాల సాయి, మైసోల్ల సాయి, కందుల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా సాయి మందిర వార్షికోత్సవ వేడుకలు..

హాలియా, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):

హాలియా పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరం 21వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం కన్నుల పండువగా, భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకున్నారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 5 గంటలకు కాగడ హారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.అనంతరం బాబాకు 108 కలశాలతో అభిషేకం, చందనోత్సవం, సంస్థాన్ హారతి, ధుని పూజ, సామూహిక భజన కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక హారతి అనంతరం భక్తులకు, స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.సాయంత్రం మహిళల కోలాటాలు,భజనల నడుమ హాలియా పట్టణ పురవీధుల్లో సాయిబాబా పల్లకి సేవతో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. సాయినామ స్మరణలతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వార్షికోత్సవం సందర్భంగా హాలియా సీఐ రాఘవరావు ఆలయాన్ని సందర్శించి



సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తేలప్రోలు శేఖర్, కార్యదర్శి సక్రు నాయక్, కోశాధికారి మిట్టపల్లి శివకుమార్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి, ధర్మకర్త మిట్టపల్లి



సుబ్బారావు,వీరమల్ల కృష్ణయ్య,చీదెళ్ల లింగయ్య, యాద యాదయ్య, శ్రీనివాస్, రవీందర్,పాంపాటి యాదగిరి, సోమయ్య,భూపాల్ రెడ్డి, మహిళలు గార్లపాటి శోభ, మేరెడ్డి ప్రవీణ్ రెడ్డి,జ్యోతి, పూజారులు మనోజ్ పాండే, రమణాచార్యులు, వెంకటాచార్యులు,వినోద్ శర్మ, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

హలో తెలంగాణ ఉద్యమకారుడ - చలో మేడారం - డాక్టర్ చీమ శ్రీనివాస్

కోదాడ టౌన్ ,నవంబర్ 18(ప్రజా జ్యోతి):

పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్ లో సూర్యాపేట జిల్లా ఉద్యమకారుల సమావేశం నిర్వహించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తానన్న హామీలను నెరవేర్చే దిశగా పనిచేస్తుందని, ఉద్యమకారుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తుందని, త్వరలో ఉద్యమకారులను గుర్తించుటకు వెబ్సైట్ ప్రారంభిస్తుందని,ఆ



వెబ్సైట్ నందు ఉద్యమకారులందరూ తమ యొక్క పేరును, కేసుల వివరాలను, బైండోవర్ వివరాలను, నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గుండెపంగు రమేష్ మాట్లాడుతూ ఈనెల 22 ఆదివారం నాడు మేడారం జరిగే సభను విజయవంతం చేయాలని, సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని, ఉద్యమకారుల ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు, సూర్యాపేట జిల్లా తెలంగాణ ఉద్యమకారులు ఏనుగుల యల్లేశ్వరరావు, పోలంపల్లి వెంకటేశ్వర్లు, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఎద్దు యాదగిరి, బోయినపల్లి సత్యనారాయణ, నార బోయిన సత్యనారాయణ, కటారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందజేత

నార్కట్ పల్లి, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను నెమ్మాని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయడం చాలా సంతోషకరమన్నారు. పెన్షన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థికంగా తోడ్పాటు నిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



క్షయ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

కోదాడ రూరల్, నవంబర్ 18(ప్రజా జ్యోతి):



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాపుగల్లు పరిధిలో గుడిబండ గ్రామం పల్లె ధవాఖాన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ఆవరణలో టీవీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య పాల్గొని మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభయాన్ ప్రచారం అనేది భారత దేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యం వేగవంతం చేయడానికి నిర్వహించే టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సామూహికంగా క్షయ నిర్ధారణ కొరకు స్ఫుటం పరీక్ష, ఎక్రే పరీక్ష ద్వారా పరీక్ష నిర్వహించి రోగులను త్వరితంగా గుర్తించడం సకాలంలో వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ ద్వారా సంభవించే మరణాలు తగ్గించడం, క్షయ సంరక్షణ కోసం చేసే ఖర్చును సున్నాకు తగ్గించటం ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఇర్ల జయసింహారెడ్డి, స్థానిక వైద్యాధికారి యశ్వంత్ కుమార్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ బండెల రాములు, హెల్త్ సూపర్వైజర్ బి సిద్ధమ్మ , స్టేల్స్ బషీర్, ఎంఎల్ హెచ్ పి షేక్ నాగూర్ బి, డాక్టర్ నాజియా, ఏఎన్ఎం ఇందిర, చంద్రకళ, పద్మ, రూపా రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన గరిడేపల్లి

- వైభవంగా పంబారట్టు,మహా పడి పూజ మహోత్సవం

- తాంత్రికవర్యులు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

గరిడేపల్లి,నవంబర్ 18(ప్రజా జ్యోతి):

మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం మహాపడి పూజ, పంబరట్టు మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించా రు.తాంత్రికవర్యులు వెంకటే శ్వర్లు శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఉదయం గణపతి హోమంతో ప్రారంభమైన ఉత్సవాల్లో విఘ్నేశ్వర,సుబ్ర హ్మణ్య స్వామి పూజలతో పాటు అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భజనలు,భక్తి సంకీర్తనలు,గ్రామోత్సవం నిర్వహించారు.సాయంత్రం భక్తుల నామస్మరణల మధ్య మహాపడి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు.పంబ రట్టు మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా భక్తు లకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామ స్మర ణతో మార్మోగింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తుల సహకారంతో మహోత్సవం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరమల్లు రమేష్ గురుస్వామి,గ్రామ పురోహితు లు కొంపెల్లి కృష్ణ శాస్త్రి,ఆలయ అర్చకులు వెంకటేశ్వర శర్మ, గురుస్వాములు,అయ్యప్ప భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే తో కుంభంతో కలిసి పెన్షన్ మంజూరి పత్రాలు అందించిన సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి,రూరల్ నవంబర్ 18ప్ర(జాజ్యోతి)

భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి మండలంలో మంజూరైన,చేయూత పెన్షన్,లబ్ధిదారులకు మంజూరి పత్రాలనుఏకే ఫంక్షన్ హాల్ నందు తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి తో కలిసి పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో డి ఆర్ డి ఓ టి.నాగిరెడ్డి మండల ప్రత్యేక అధికారి శ్యామ్ సుందర్ పి ఏ సి ఎస్ చైర్మన్,ఫకీరు కొండల్ రెడ్డి ఎంపీడీఓ విజయలక్ష్మి ఎంపి ఓ దినకర్,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో భువనగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు,అవుతున్నాయని అన్నారు.అదే విధంగా నేటి నుండి ఇందిరమ్మ ఇన్సురెన్స్ కూడ ప్రారంభం అవుతుందని కుటుంబ పెద్ద చనిపోతే ప్రభుత్వం ద్వారా 5లక్షల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని లబ్ధిదారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



టీ కబుర్లతో సందడిగా మారిన దేవరకొండ టీ టైమ్..

ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించిన వడ్త్య రమేష్

దేవరకొండ, నవంబర్ 18, (ప్రజా జ్యోతి) :

సాయంత్రం వేళ దేవరకొండ పట్టణంలోని ప్రముఖ మల్లయ్య అండ్ దేవ నాయక్ టీ హోటల్‌లో నిర్వహించిన 'టీ టైమ్' కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకుడు వడ్త్య రమేష్ పాల్గొని, పట్టణ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ సేవిస్తూ ఆప్యాయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా ప్రజలతో కలిసిమెలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలు, స్థానిక పరిస్థితులు, ప్రజా సమస్యలపై సరదాగా చర్చిస్తూ కొంతసేపు ఆహ్లాదకరంగా గడిపారు. ప్రజల మధ్యకు వెళ్లి వారితో నేరుగా మాట్లాడటం ద్వారా నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయ అనుబంధం మరింత బలపడుతుందని ఈ సందర్భంగా కనిపించింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లగాసు సత్యనారాయణ, చిత్రం యూసుఫ్, మకాం చంద్రమౌళి, నజీర్ సత్తార్, బాబా, లక్ష్మణ్, ఫజల్, నేనావత్ నరసింహ నాయక్, నోముల మహేష్‌తో పాటు దేవరకొండ పట్టణ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అభిప్రాయం వెల్లడించాలి

- రూరల్ ఇన్స్పెక్టర్ పి ఎన్ డి ప్రసాద్

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు పై ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో గ్రామస్తులకు కౌన్సిలింగ్

దామరచర్ల, నవంబర్ 18,(ప్రజాజ్యోతి):

దామరచర్ల మండలంలోని వీర్లపాలెం శివారులో సోహమ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఈనెల 20న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు నిరభ్యంతరంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు మాత్రం చేయవద్దని కోరారు రూరల్ ఇన్స్పెక్టర్ పి. నాగ దుర్గాప్రసాద్. బుధవారం వీర్లపాలెం లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు వలన జరిగే అనర్థాలను, అవకాశాలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని మాట్లాడాలన్నారు. అభిప్రాయ సేకరణలో అధికారులు, ఎన్జీవోలు, పర్యావరణవేత్తలు, కంపెనీ యాజమాన్యం పాల్గొంటారని, ప్రతి ఒక్కరి అభిప్రాయం వీడియో రికార్డింగ్ జరుగుతుందని తెలిపారు. తమ అభిప్రాయాన్ని వెల్లడించేవారు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని ఆపై తమ అభిప్రాయాన్ని నిర్భయంగా వెల్లడించాలని కోరారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల ఏదైనా నష్టం వాటిల్లుతుందంటే ఆ కారణాలను వివరించాలని అదేవిధంగా ఫ్యాక్టరీ ఏర్పాటు వలన దొరికే ఉపాధి అవకాశాలను తమ గ్రామానికి



కేటాయించాలని, గ్రామాల అభివృద్ధికి ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారం తదితర అన్ని విషయాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు. కానీ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటామంటే మాత్రం సహించబోమని హెచ్చరించారు. కొందరు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారని అది సరికాదన్నారు. తమ అభిప్రాయాన్ని నేరుగా చట్టపరిధిలో వెల్లడించే అవకాశం ఉన్నదని ఆ విధంగానే వెల్లడించాలని కోరారు. వాడపల్లి ఎస్సై ఎన్. ధర్మ మాట్లాడుతూ



ప్రజలంతా సామరస్యంగా తమ అభిప్రాయాలను వెల్లడించి శాంతి భద్రతల రక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం ప్రజాప్రతినిధులు సిబ్బందితో కలిసి సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను సి ఐ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేనావత్ శ్రావణి నాగనాయక్ , ఉప సర్పంచ్ చిట్యాల రజిని శ్రీనివాస్ ,గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ఏఐకేఎస్‌కు కొత్త సారథులు..

- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడిగా అశోక్ దావలే..

ప్రధాన కార్యదర్శిగా విజూ కృష్ణన్.

- కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి ఎన్నిక..

167 మందితో జాతీయ కమిటీ ఏర్పాటు..

నల్లగొండ నవంబర్ 18,(ప్రజా జ్యోతి):

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడిగా అశోక్ దావలే, ప్రధాన కార్యదర్శిగా విజూ కృష్ణన్, కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి ఎన్నికయ్యారు. నల్లగొండలో జరుగుతున్న 36వ జాతీయ మహాసభల్లో బుధవారం నూతన జాతీయ కమిటీని ఎన్ను కున్నారు. మొత్తం 167 మందితో జాతీయ కమిటీని, 86 మందితో సెంట్రల్ కిసాన్ కౌన్సిల్ (సీకేసీ)ని ఏర్పాటు చేయగా, 27 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా 12 మంది, సంయుక్త కార్యదర్శులుగా 12 మంది





ఎన్నికయ్యారు.తెలంగాణ నుంచి టీ. సాగర్, పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి సహా పలువురికి జాతీయ కమిటీలో చోటు దక్కింది. వీరిలో టీ. సాగర్, పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి సీకేసీకి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు జాతీయ కమిటీకి, ముగ్గురు సీకేసీకి ఎన్నికయ్యారు.

డ్రైనేజీ దుస్థితి.. దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):

మున్సిపాలిటీలోని 5వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో నేరుగా రహదారులపైకి చేరుతున్నాయి. దీంతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో మురుగునీరు నిలిచిపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.నిల్వ ఉన్న మురుగునీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి 5వ వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, మురుగునీరు రోడ్లపైకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నిరుపేదలకు చేయూత పింఛన్లతో ఆర్థిక భరోసా

– అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బాలునాయక్

– గుడిపల్లి మండలంలో 223 మందికి, పీఏ పల్లి మండలంలో 433 మందికి కొత్త పింఛన్లు మంజూరు

– లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బాలునాయక్

– రూ.15 కోట్లతో మూడు మండలాల్లో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం – కొండమల్లేపల్లిలో వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు

దేవరకొండ, నవంబర్ 18, (ప్రజా జ్యోతి) :

నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.గుడిపల్లి మండలంలో 223 మంది, పీఏ పల్లి మండలంలో 433 మంది లబ్ధిదారులకు మంజూరైన కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అందించే పింఛన్ సొమ్ము పేదలకు నిత్యావసరాలు, వైద్య ఖర్చుల కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని, వారు ఆత్మగౌరవంతో జీవించేందుకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి పథకాల



ద్వారా ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు.

దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయం తీసుకొచ్చాం

గతంలో ఆర్డీఓ కార్యాలయం మిర్యాలగూడలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజల సౌకర్యార్థం దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయాన్ని తీసుకొచ్చానని గుర్తుచేశారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో గుడిపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండలాల్లో సుమారు రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయ సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

కొండమల్లేపల్లిలో వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం

గతంలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు, మండల అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి, మావిల్ల లక్ష్మీనారాయణ, ఏవీ రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, వంగాల ప్రతాపరెడ్డి, వీరబోయిన ఎల్లయ్య యాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మద్దిమడుగు రామస్వామి, తేరా సత్యం రెడ్డి, మండలాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అరిగోస.. "కొనుగోళ్లకు మోక్షమెప్పుడో"

- నెలల తరబడి మార్కెట్ కేంద్రాల్లోనే ధాన్యం రాశులు..

- రైతులకు తప్పని ఎదురుచూపులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):

ఆరుగాలం కష్టించి, చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని అమ్ముకుజనేందుకు రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. పంట చేతికొచ్చి నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మార్కెట్ కేంద్రాల్లో ధాన్యం రాశులుగా పేరుకుపోయి రోజుల తరబడి ఎదురుచూస్తున్నా కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రాలు ప్రారంభం.. కొనుగోళ్లు ఎక్కడ?

ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో హడావుడిగా కేంద్రాలను ప్రారంభించి రిబ్బన్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ప్రారంభోత్సవాల సమయంలో చూపిన హడావుడి ఆ తర్వాత కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం సేకరణ చేపట్టకపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతోంది.

అప్పుల భారం.. వడ్డీల మోత



సాగు కోసం రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేశారు. పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం విక్రయించి అప్పులు తీర్చుకోవాలని భావించారు. కానీ కొనుగోళ్లు ఆలస్యం కావడంతో అప్పులపై వడ్డీలు పెరుగుతున్నాయి. మరోవైపు కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వ్యవసాయానికి చేసిన పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. ధాన్యం అమ్ముడుపోకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రైవేటు వ్యాపారుల వైపు చూడాల్సిన దుస్థితి

ప్రభుత్వ కొనుగోళ్లు ఆలస్యం కావడంతో కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించకపోయినా, తక్కువ ధరకు ధాన్యం విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దళారులు రంగప్రవేశం చేసి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకునే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో పనిచేస్తే ప్రైవేటు వ్యాపారుల చేతిలో నష్టపోయే పరిస్థితి ఉండదని అంటున్నారు.

అధికారులు స్పందించేదెప్పుడు..?

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన సంబంధిత శాఖల అధికారులు కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉంచి వెంటనే ధాన్యం సేకరణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేవలం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఫొటోలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవాలని కోరుతున్నారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత. పంట పండించే వరకు రైతు పడే కష్టం ఒక ఎత్తయితే, పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు పడుతున్న అవస్థలు మరో ఎత్తుగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించాలి. లేకుంటే రైతుల కష్టాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అన్న ప్రశ్నలు అన్నదాతల నుంచి వినిపిస్తున్నాయి.

నల్లగొండ కార్పొరేషన్ కమిషనర్ బదిలీ..

- వంశీకృష్ణకు స్థానంలో .. ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీజారెడ్డి నియామకం..

- ఆకస్మిక బదిలీతో మున్సిపల్ కార్పొరేషన్‌లో చర్చనీయాంశం..



నల్లగొండ నవంబర్ 18,(ప్రజా జ్యోతి):

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. వంశీకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డిని ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించినట్లు సమాచారం. ఈ ఆకస్మిక పరిణామం కార్పొరేషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కమిషనర్‌గా వంశీకృష్ణ బదిలీ కావడం, ఆయన స్థానంలో శ్రీజారెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో కార్పొరేషన్‌లో ఒక్కసారిగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇంతకీ వంశీకృష్ణ బదిలీకి దారితీసిన పరిస్థితులేమిటి? ఇటీవల కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న పరిణామాలేమైనా ఇందుకు కారణమా? అన్న చర్చ ఉద్యోగవర్గాలతో పాటు రాజకీయ, ప్రజావర్గాల్లోనూ సాగుతోంది.అయితే, వంశీకృష్ణ బదిలీకి సంబంధించిన కారణాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టనున్న శ్రీజారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిపాలన ఏ విధంగా కొనసాగనుందో వేచి చూడాలి.

రేజాంగ్ లా యుద్ధ వీరులకు ఘన నివాళులు

- దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 114 మంది యాదవ వీర జవాన్లకు నివాళులర్పణ



దేవరకొండ, నవంబర్ 18, (ప్రజా జ్యోతి) :

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం రేజాంగ్ లా యుద్ధంలో వీరమరణం పొందిన 114 మంది యాదవ వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ సభ్యులతో కలిసి వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్‌వీటీ మాట్లాడుతూ.. 1962లో భారత్–చైనా సరిహద్దులో జరిగిన రేజాంగ్ లా యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మరువకూడదన్నారు. మాతృభూమి రక్షణ కోసం వారు చేసిన త్యాగం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, యువత దేశభక్తి, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ దేశ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్, సర్పంచ్ ముంతా మల్లేష్ యాదవ్, నేతాల వెంకటేష్ యాదవ్, నరసింహ యాదవ్, సుజిత్ యాదవ్, బాలరాజు యాదవ్, సాయి చరణ్, శేఖర్, రాజేష్, రఘు తదితర క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

- నాలుగో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



హాలియా,నవంబర్18 (ప్రజాజ్యోతి):

మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి తెలిపారు.పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ, రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.బుధవారం హాలియా మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చైర్మన్ చింతల చంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి వార్డుల వారీగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌనీ రాజా రమేష్ యాదవ్,9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులు,సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.